బుధవారం
29 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:103
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal
Registration No.: VZM/22/2020-2022
Period of Renewal


# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

### బెంగాల్‌లో నేడు తుది విడత ఎన్నికలు

142 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన ఈసీ



2 లో

## ఏఐ సిటీగా విశాఖి

- గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబునాయుడు
- నగరానికి 60 రోజుల్లో గోదావరి నీరు
- జూన్ 1 నుంచి కొత్త రైల్వే జోన్ కార్యకలాపాలు
- జూలైలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభం

విశాఖపట్నం, :విశాఖపట్నాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీగా, విశ్వనగరిగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. జిల్లాలోని ఆనందపురం మండలం తర్లువాడ గ్రామం వద్ద మంగళవారం గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గూగుల్ ప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

వివరాలు2లో..







## ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని మోదీ..

### యువకులతో పోటీపడి గోల్స్..!

గాంగ్‌టక్: సిక్కిం రెండు రోజుల పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఉదయం సరదాగా ఫుట్‌బాల్‌ఆడారు. రాజధాని గాంగ్‌టక్ స్థానిక యువతీ యువకులు ఫుట్‌బాల్ ఆడుతుండగా అక్కడకు వెళ్లిన మోదీ వారితో కాసేపు ముచ్చటించారు. తాను కూడా ఫుట్‌బాల్ ఆడుతానని వారితో చెప్పారు. కాసేపట్లోనే స్పోర్ట్స్ జెర్సీ ధరించి వచ్చిన ప్రధాని మోదీ సిక్కిం ఆటగాళ్లతో సరదాగా ఫుట్‌బాల్ ఆడి, గోల్స్ కోట్టారు.ఈ సాకర్ సెషన్‌ను ప్రధాని ఉత్సాహభరితంగా అభివర్ణించారు. మోదీ, తాను యువకులతో సాకర్ ఆడుతున్న కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రధాని ఫుట్‌బాల్ ఆడిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "గాంగ్‌టక్‌లోని ఒక అందమైన ఉదయం వేళ సిక్కింలోని నా యువ మిత్రులతో ఫుట్‌బాల్ ఆడటం

వివరాలు2లో..



### మార్కెట్లకు చమురు భయాలు

సెన్సెక్స్ 417 పాయింట్ల పతనం
రూపాయిపైనా ఒత్తిడి



ముంబయి : అమెరికా సామ్రాజ్యవాదంతో అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా చమురు ధరల భయాలు మార్కెట్లను, రూపాయిని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. మంగళవారం


వివరాలు2లో..

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం

- భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది
- మన భవిష్యత్ నిర్మించడానికి వైజాగ్ సిద్ధంగా ఉంది
- 2047 నాటికి ట్రిలియన్ డాలర్
- ఆర్థిక వ్యవస్థగా విశాఖను తీర్చిదిద్దుతాం
- పదేళ్లలోనే విశాఖ శరవేగంగా అభివృద్ధి సాధిస్తుంది
- అద్భుతమైన ప్రయాణానికి ఇది ఆరంభం మాత్రమే

విశాఖ నోవాటెల్ హోటల్ లో జరిగిన భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్ లో మంత్రి నారా లోకేష్ ) విశాఖపట్నం డెక్కన్ న్యూస్ : ఈ రోజు కేవలం విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రారంభం మాత్రమే కాదని, భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'భారతదేశ ఏఐ కారిడార్ ను ఉమ్మడిగా నిర్మించడం అనే అంశంపై గూగుల్ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హోటల్ లో జరిగిన భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్ లో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. అదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్ కు ఇది కీలకమైన మలుపు. విశాఖపట్నం.. మనం ప్రేమగా వైజాగ్ అని పిలిచే ఈ నగరం సాధారణ నగరం కాదు. దశాబ్దాలుగా ఇది భారతదేశానికి ఒక గేట్ వేలా పనిచేస్తోంది. భారతదేశంలోని ఖనిజ సంపదను ప్రపంచానికి అనుసంధానించింది. ఈ నగరం ఉక్కుతో నిర్మితమైంది. కానీ ఈ రోజు మనం విశాఖ పునాదులను ఏఐ విప్లవంపై నిర్మించబోతున్నాం. విశాఖ మన దేశ భవిష్యత్తును నిర్మించబోతోందని నేను బలంగా విశ్వసిస్తున్నాను. విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతుంది : మనం ఈ రోజు ఒక చరిత్రాత్మక మలుపు వద్ద ఉన్నాం. ప్రపంచం రోజురోజుకీ మారుతోంది. ప్రపంచం భారీ పరిశ్రమల నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాల వైపు, తయారీ నుంచి మెషిన్ ఇంటెలిజెన్స్ వైపు మారుతోంది. ఈ ప్రయాణంలో వైజాగ్ మళ్లీ అభివృద్ధి చెందుతోంది. గూగుల్ ఏఐ హబ్ ప్రారంభంతో ఈ మార్పును మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. దేశంలోనే అతిపెద్ద విదేశీ

వివరాలు2లో..



## హార్ముజ్ జలసంధిని తెరుస్తాం!

మా షరతులు అంగీకరించండి : ఇరాన్
పరిశీలిస్తున్నామన్న అమెరికా
శాంతి స్థాపనకు సహకరిస్తాం : రష్యా




వాషింగ్టన్ / టెహ్రాన్ : అమెరికా, ఇరాన్ మధ్య చర్చలపై సందిగ్ధత కొనసాగుతున్న సమయంలో ఇరాన్ కొత్త ప్రతిపాదన చేసింది. హార్ముజ్ జలసంధిని తెరుస్తామని, అయితే తమ షరతులను అంగీకరించాలని స్పష్టం చేసింది. ఇరాన్ చేసిన తాజా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని వైట్‌హౌస్ అధికారికంగా ప్రకటించింది. అణు కార్యక్రమంపై స్పష్టత లేకపోవడంతో ట్రంప్ ఈ ప్రతిపాదనపై అసంతృప్తిగా ఉన్నారని అమెరికా అధికారులు వెల్లడించారుప్రతిపాదనలో ఏముందిఇరాన్ ప్రతిపాదనలను పాకిస్తాన్.. వాషింగ్టన్‌కు లిఖితపూర్వకంగా అందించింది. ఈ ప్రతిపాదనల్లో ప్రధానంగా మూడు అంశాలను ఇరాన్ లేవనెత్తింది. మొదటిది హార్ముజ్ జలసంధిపై అమెరికా నిర్బంధాన్ని ఆపేయాలి. రెండోది ఇరాన్ రేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. మూడవది యుద్ధం ముగిసిన తర్వాతే అణు కార్యక్రమంపై చర్చలు జరపాలని ఇరాన్ తెలిపింది. అమెరికా 'అణు విషయాలపై చర్చలు మొదటి నుండే జరగాలి' అని పట్టుబడుతోందిట్రంప్ అసంతృఅమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఈ ప్రతిపాదన నచ్చలేదని ఒక అమెరికా అధికారి మీడియాకు తెలి పారు. 'ఇరాన్ పతనం అంచున ఉందని ఇప్పుడే తెలిపింది. హార్ముజ్‌ను తెరవాలని వేడుకుంటుంది' అని సోషల్ ట్రూత్‌లో ట్రంప్ వెల్లడించారు. మంగళవారం నాడు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మాట్లాడుతూ.. 'ఇరాన్‌లో మత పెద్దల పాలన కొనసాగినంత కాలం అది అణ్వాయుధాల వైపు పరుగులు తీస్తూనే ఉంటుంది. ఆ ముప్పును వెంటనే పరిష్కరించాలి' అని బెదిరించారుశాంతి స్థాపనకు సహకరిస్తాం : పుతిన్ఇరాన్

వివరాలు2లో..

### విశాఖపట్నం ఇక నుంచి ఏఐ పట్నం..

దక్షిణాదిపై అశ్వినీ వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు





విశాఖపట్నం: విశాఖ గూగుల్ ఏఐ డెటా సెంటర్ ప్రారంభంలో దక్షిణాదిపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... మోదీ సర్కారుకు

వివరాలు2లో..

## ఉగ్రవాదానికి మద్దతిస్తే ఉక్కు పాదం

'ఆపరేషన్ సిందూర్'తో అది నిరూపించాం- భారత్ భాగస్వామ్యాన్ని విస్తరిస్తాం- ఎస్‌సీవో సమావేశంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

బిష్కెక్, ఏప్రిల్ 28: ఉగ్రవాదంపై ఎలాం టి ద్వంద్వ ప్రమాణాలకు తావు ఉండకూడదని, ఉగ్రవాదులకు మద్దతిచ్చే, ఆశ్రయం కల్పించే దేశాలపై ఎస్‌సీవో (షాంఘై సహకార సంస్థ) కఠిన చర్యలు తీసుకోవాల్సిం దేనని భారత రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం కిర్గిస్థాన్‌లో జరిగిన ఎస్‌సీవో రక్షణ మంత్రుల సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. గతేడాది పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి ప్రస్తావిస్తూ ఈ ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందన్నారు. దీని అనంతరం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి ఉగ్రవా దులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భార త్ నిరూపించిందన్నారు. ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని



వ్యా ఖ్యానించారు.తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండానే ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్ర దాడులను అస్సలు విస్మరించకూడదని

వివరాలు2లో..

### భారత్‌కు డోలా అప్పగింత

తుర్కియే నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి




2 లో

## ప్రపంచ పటంలో ఫ్యూచర్ సిటీ

జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించుకుందాం
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌రేట్ నిర్మాణ భూమి పూజలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, : ప్రపంచంలోనే మేటి నగ రంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొ న్నారు. ఫ్యూచర్ సిటీ కోసం స్థానిక రైతులు భూములు ఇచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆనందంగా పరిహారం తీసుకోవాలని, మనందరం కలిస్తేనే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మంగళ వారం రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, డీజీపీ శివధర్‌రె డ్డితో కలిసిన రేవంత్‌రెడ్డి

వివరాలు2లో..



## ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని మోదీ..

మొదటి పేజీ తరువాయి

కంటే గొప్పది ఏదీ లేదు! స్పష్టంగా, ఈ యువకులతో ఇది ఒక ఉత్తేజకరమైన ఫుట్‌బాల్ సెషన్!" అని ప్రధాని ఎక్స్ లో పేర్కొన్నారు.

## ఏఐ పట్నం..ఏఐ పట్నం..

మొదటి పేజీ తరువాయి

దక్షిణాదిపై ఏమాత్రం వివక్ష లేదని ప్రకటించారు. విశాఖపట్నాన్ని ఇకపై ఏఐ పట్నం అని పిలుస్తారని, ఈ రోజు విశాఖపట్నం అంటే? సైబరాబాద్ లాగా, ఇది ఏఐ పట్నం అవుతుందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. బుల్లెట్ రైళ్ల ద్వారా దక్షిణాది ముఖచిత్రం మారబోతోందని చెప్పారు. అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మధ్య కనెక్టివిటీ పెరగనుందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అహ్మదాబాద్-ముంబై, అహ్మదాబాద్-హైదరాబాద్ మధ్య అతి త్వరలోనే బుల్లెట్ ట్రైన్ వస్తోందన్నారు. బుల్లెట్ ట్రైన్ వస్తే అహ్మదాబాద్-హైదరాబాద్ జర్నీ కేవలం 70 నిమిషాలు మాత్రమే అన్నారు.బుల్లెట్ రైళ్లతో హైస్పీడ్ డైమండ్ ఏర్పాటు కాబోతుందని పేర్కొన్నారు. హైస్పీడ్ డైమండ్.. దక్షిణాది పట్ల తమకున్న నిబద్ధతకు తార్కాణం అన్నారు. దక్షిణాది పట్ల వివక్ష ఉందని విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. విపక్షాల తప్పుడు ప్రచారాన్ని అభివృద్ధితో తిప్పి కొడుతున్నామని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. అన్ని రంగాల్లో దక్షిణాదికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. రైల్వేలు, హైవేలు, విద్యుత్, పోర్టులు అన్ని రంగాల్లోనూ భారీ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. మోదీ సర్కార్ అన్ని రాష్ట్రాలకూ సమాన అవకాశాలు కల్పిస్తోందని స్పష్టం చేశారు. సదరన్ స్టేట్స్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, దక్షిణాది అభివృద్ధికి ప్రయత్నిస్తుంటే విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పునరుద్ఘాటించారు. విపక్షాలు చెప్పేది అబద్ధమని ప్రతిసారి రుజువవుతోందన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నదే ప్రధాని మోదీ ఆకాంక్షఅని కేంద్రమంత్రి వెల్లడించారు.

## భారత్‌కు డోలా అప్పగింత

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 28: తుర్కియే ఇస్తాంబుల్‌లో అరెస్ట్ అయిన దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను భారత్‌కు అప్పగించడంతో అతడిని మంగళవారం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తీసుకొచ్చారు. తుర్కియే పోలీసులు, భారత ఇంటలిజెన్స్ సంయుక్తంగా ఇస్తాంబుల్‌లో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం విచారణ నిమిత్తం ఇంటెలిజెన్స్ అధికారులు కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా డోలాను ముం బై, లేదా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకు అప్పగించనున్నట్లు సమాచారంఇతన్ని అదుపులోకి తీసుకోవడంతో అంతర్జాతీయ డ్రగ్ మాఫియాకు ఎదురుదెబ్బ తగిలింది. దావూద్‌కు చెందిన డీ విదేశాల్లో నిర్వహించే డ్రగ్ ఆపరేషన్లకు డోలానే ప్రధాన సూత్రధారి. ఇతడి కనుసన్నల్లో ఏడాదికి రూ. 5వేల కోట్ల డ్రగ్స్ వ్యాపారం సాగుతోందనే అంచనాలున్నాయి. కొన్ని నెలల క్రితం డోలా నెట్‌వర్క్‌కు చెందిన సలీమ్ సోహైల్ షేక్ అనే డాలర్ దుబాయ్‌లో అరెస్టయ్యాడు. అతడిని భారత్‌కు అప్పగించిన తరువాత ఈ డ్రగ్ నెట్‌వర్క్ తీగ లాగితే డొంక కదిలిందిసలీమ్ డోలా కుమారుడు తాహెర్ కూడా గతేడాది పట్టుబడ్డాడు. అతన్ని కూడా భారత్‌కు తీసుకు వచ్చి విచారించారు. ఈ క్రమంలో డోలా ఆచూకీ లభించినట్లు తెలుస్తుంది. 2024లో ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు 4 కిలోల డ్రగ్స్ పట్టుకున్నారు. దీని విలువ రూ. 10 కోట్లు విచారణలో భాగంగా మహారాష్ట్ర, సాంగ్లీ, గుజరాత్‌లోని సూరత్ నుంచి దుబా య్ మీదుగా టర్కీ వరకు ఉన్న నెట్‌వర్క్‌ను పోలీసులు కనుగొన్నారు. ఈ నెట్‌వర్క్‌ను సలీండోలా తెరవెనుక ఉండి నడిపిస్తున్నట్లు గుర్తించారు. అప్పటి నుంచి పోలీసులు, దర్యాప్తు బృందాలు గుట్టుచప్పుడు గాకుం డా దర్యాప్తు చేపట్టి చివరికి దావూద్ డ్రగ్స్ నెట్‌వర్క్ ముఖ్యుడు సలీం డోలాను అరెస్టు చేశారు.

## బెంగాల్‌లో నేడు తుది విడత ఎన్నికలు

కోల్‌కతా, ఏప్రిల్ 28: పశ్చిమ బెంగాల్ తుది విడత అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ విడతలో 142 స్థానాలకు పోలిం గ్ జరుగనుంది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏ ర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల సంఘం సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఉంచిం ది. శాంతి భద్రతల కోసం భారీగా కేంద్ర బలగాలను రంగంలోకి దించారు.రాష్ట్రవ్యా ప్తంగా మొత్తం 294 అసెంబ్లీ స్థానాలు ఉండ గా, ఎన్నికల సంఘం రెండు విడతల్లో పోలిం గ్ నిర్వహించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఈ నెల 23న 152 స్థానాలకు మొ దటి విడత పోలింగ్ జరిగింది. మొదటి విడతలో ఏకంగా 93 శాతం ఓటింగ్ నమోదైం ది. తద్వారా రాష్ట్రం అరుదైన రికార్డు నమో దు చేసింది. భారతదేశ చరిత్రలోనే ఇదే అత్యధిక ఓటింగ్ శాతం కావడం గమనార్హం. ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్, బీ జేపీ మధ్య గట్టి పోటీ కనిపిస్తోంది.

## మార్కెట్లకు చమురు భయాలు

మొదటి పేజీ తరువాయి

బిఎస్‌ఇ సెన్సెక్స్ 417 పాయింట్లు లేదా 0.54 శాతం పతనమై 76,886.91కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 97 పాయింట్లు 0.4 శాతం క్షీణించి కీలకమైన 24,000 మార్కు దిగువన 23,995.70కు పరిమితమయ్యింది. చమురు ధరల ఒత్తిడి, నెల చివరిలో అమెరికన్ డాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి 24 పైసలు తగ్గి 94.39 స్థాయికి చేరుకుంది.అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశంపై నెలకొన్న అనిశ్చితి మార్కెట్లను దెబ్బతీసింది. ఇరాన్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందం పట్ల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అసంతృప్తిగా ఉన్నారన్న వార్తలతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. హార్ముజ్ జలసంధి ద్వారా సరఫరా నిలిచిపోవడంతో బ్రెంట్ క్రూడ్ ధర 2.78 శాతం పెరిగి బ్యారెల్‌కు 111.24 డాలర్లకు చేరుకుంది.

# ఏఐ సిటీగా విశాఖ

మొదటి పేజీ తరువాయి

ప్రసంగిస్తూ విశాఖపట్నానికి నీటి కొరత లేదని, 60 రోజుల్లో గోదావరి నీరు తీసుకువస్తామన్నారు. అదేవిధంగా జూన్ ఒకటో తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనిచేస్తుందని, దీనికి అవసరమైన గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడానికి కేంద్ర రైల్వే మంత్రి అంగీకరించారన్నారు. జూలై నెలలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తామని, దానికి ప్రధాని నరేంద్రమోదీ వస్తారన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇటీవల శంకుస్థాపన చేసిన ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంటు 2028 నుంచి ఉత్పత్తి ప్రారంభించి తొలి షిప్‌మెంట్ చేస్తుందన్నారు. అలాగే రెన్యూ పవర్ కూడా సోలార్ ఇన్‌గాట్స్ ఉత్పత్తి ప్రారంభిస్తుందన్నారు. ఈ గూగుల్ డేటా సెంటర్‌ను కూడా 2028 సెప్టెంబరు నాటికి తొలి దశ పూర్తిచేసి ప్రధాని నరేంద్రమోదీని ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తామన్నారు. వీటన్నింటితో ఉత్తరాంధ్ర శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటివరకు ఉపాధి కోసం ఉత్తరాంధ్ర ప్రజలు వలస పోయేవారని, ఇకపై అవన్నీ ఆగిపోయి మేధోవలసలు రివర్స్‌లో ఇక్కడికి వస్తాయన్నారు. ఈ భారీ పరిశ్రమలు, ఐటీ కంపెనీలతో ఉపాధి అవకాశాలు అందరికీ లభిస్తాయన్నారు. తూర్పుతీరంలో కోల్‌కత్తా నుంచి చెన్నై వరకు ప్రస్తుతం రెండే రైల్వే లైన్లు ఉన్నాయని, వీటిని నాలుగు చేయడానికి కేంద్రం పచ్చజెండా ఊపిందని, దీనివల్ల ఏపీలో అనేక ప్రాంతాలకు నాలుగు రైల్వే లైన్ల నిర్మాణం జరుగుతుందని, అందులో విశాఖపట్నం కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

# 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం

మొదటి పేజీ తరువాయి

ప్రత్యక్ష పెట్టుబడి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో పాటు ఒక గిగా వాట్ డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఏర్పాటుకానుంది. ఇది సాధారణ వృద్ధి కాదు, భారీస్థాయి అభివృద్ధి. మొదటిసారి వైజాగ్ లో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. కనెక్టివిటీ విషయంలో మనం ఇతర రాష్ట్రాలతో పోటీ పడతాం. ఒకప్పుడు పోర్టులు ఈ నగరాన్ని ప్రపంచంతో కలిపినట్లే, ఈ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు డిజిటల్‌గా ప్రపంచంతో అనుసంధానం చేస్తాయి. అద్భుతమైన ప్రయాణానికి ఇది ఆరంభం : ప్రపంచవ్యాప్తంగా వర్జీనియా నుంచి డబ్లిన్ వరకు డేటా సెంటర్ల ప్రభావాన్ని మనం చూశాం. కాబట్టి ఈ పెట్టుబడిని కేవలం 15 బిలియన్ డాలర్లుగా చూడకండి. ఇది ఒక బలమైన ఎకోసిస్టమ్‌కు పెట్టుబడి. ఒక అద్భుతమైన ప్రయాణానికి ఆరంభం. ఈ పెట్టుబడి వల్ల విశాఖపట్నంలో సుమారు 2 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వస్తాయి. నూతన పరిశ్రమలు కూడా ఈ ఎకోసిస్టమ్ చుట్టూ అభివృద్ధి చెందుతాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. ఇది ఆర్థిక అభివృద్ధికి ఒక మల్టిప్లయర్. డేటా, సంఖ్యలకంటే ఎక్కువగా వైజాగ్‌కు ఉన్న మరో బలం.. ఇక్కడి శక్తి, ప్రతిభ, ఆత్మవిశ్వాసం. 2014లో అతిపెద్ద తుఫాను విశాఖను తాకింది. చెట్లు అన్నీ నేలకూలిపోయాయి. కానీ 48 గంటల్లోనే ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిని నవ్వుతూ ఆహ్వానించారు. ఇది ఈ నగర ప్రజల స్థైర్యానికి నిదర్శనం. దీపావళి సమయంలో అగ్నిప్రమాదాల నివారణకు టపాసులు కాల్చవద్దని చంద్రబాబు గారు పిలుపునిస్తే ఒక్కరు కూడా వాటి జోలికి వెళ్లలేదు. అదే వైజాగ్ స్ఫూర్తి, బాధ్యత. ఇది యువత ఆశయాలు కలిగిన నగరం. ఇక్కడ సృజనాత్మకత సహజం. జీవితం, పని సమతుల్యంగా ఉన్న నగరం ఇది. ఇవన్నీ వైజాగ్ ను ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థికవ్యవస్థగా విశాఖ ఎకనమిక్ రీజియన్ ను తీర్చిదిద్దాలనేది ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ సంస్థతో గ్రీన్ స్టీల్ సిటీకి శంకుస్థాపన చేశాం. అదేవిధంగా ఏఐ, డేటా, ఫార్మా, మెడికల్ డివైసెస్ రంగాల్లో భారీ అభివృద్ధి జరుగుతోంది. ఈ ప్రాంతం కృత్రిమ మేధ(ఏఐ), క్లీన్ ఎనర్జీ, మెడికల్ తయారీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్‌కు కేంద్రంగా మారబోతోంది. హైదరాబాద్ అభివృద్ధిని మనం అందరం చూశాం. ఒకప్పుడు సైబర్ టవర్స్ నిర్మాణానికి చంద్రబాబు సంకల్పించినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. కంప్యూటర్లు అన్నం పెడతాయా అని విమర్శించారు. కానీ స్పష్టమైన విజన్, పట్టుదలతో అది సాధ్యమైంది. హైదరాబాద్‌లో 30 ఏళ్లలో జరిగిన అభివృద్ధిని.. విశాఖలో వచ్చే 10 పదేళ్లలోనే సాధించాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. మా విధానం సింపుల్ గా ఉన్నా శక్తివంతమైంది. విస్తృతి, సమగ్రత, స్వయం సమృద్ధి. పెట్టుబడులు ఆకర్షించడం మాత్రమే కాదు.. మొత్తం పరిశ్రమలను స్థాపించడం మా లక్ష్యం. గూగుల్ మాపై నమ్మకం ఉంచి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడం గొప్ప విషయం. ఇది ఇప్పుడు మీ ప్రాజెక్ట్ మాత్రమే కాదు..మన అందరి ప్రాజెక్ట్. మేం ఎంవోయూలపై కాకుండా షేక్ హ్యాండ్ లపై నమ్మకం ఉంచుతాం. ఒకసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రం. మేం చాలా కసితో ఉన్నాం. మమ్మల్ని ఒక స్టార్టప్‌లా చూడండి. చరిత్రలో నాలుగుసార్లు రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాల్సి వచ్చింది. మొదట మద్రాస్ లో భాగంగా ఉన్నాం. తర్వాత కర్నూలు రాజధానిగా ఉన్నాం. కొన్నేళ్ల తర్వాత తెలంగాణ, ఏపీ విడిపోయాయి. అందరం కలిసి ఆనాడు హైదరాబాద్ ను అభివృద్ధి చేసుకున్నాం. తర్వాత విడిపోయాం. మాకు ఉన్న కసి, సంకల్ప బలం మమ్మల్ని ముందుకు తీసుకెళ్తోంది. అందరితో కలిసి మేం చరిత్ర సృష్టించానుకుంటున్నాం. మా కేబినెట్ లో 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు. శాసనసభ్యుల్లో సగం మంది మొదటిసారిగా ఎన్నికైన వారు. మేం అందరం ఉత్సాహంతో, కసితో పనిచేస్తున్నాం. పెట్టుబడిదారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం. ఏపీ, వైజాగ్ లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్, గూగుల్ గ్లోబల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలే తో పాటు 49 కంపెనీల ప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# హార్మ్యాజ్ జలసంధిని తెరుస్తాం!

మొదటి పేజీ తరువాయి

విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీ ఒమన్‌లో పర్యటించిన అనంతరం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో పుతిన్‌ను కలిశారు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు రష్యా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అంతేకాదు 'ఇరాన్ ప్రజలు తమ స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం కోసం ఎంతో ధైర్యంగా, వీరోచి తంగా పోరాడు తున్నారు' అని పుతిన్ అరాగ్చీతో అన్నారు. వారు ఈ కష్ట కాలాన్ని అధిగమిం చగలరని, శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు. 'మా వంతుగా, వీలైనంత త్వరగా శాంతిని నెలకొల్పేందుకు, మీ ప్రయోజనాలకు, ఈ ప్రాంత ప్రజలందరి ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రతిదా న్నీ మేము చేస్తాం' అని పుతిన్ స్పష్టం చేశారని రష్యా ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరాగ్చీ, పశ్చిమాస ియాలో భారీ మార్పులు జరుగుతున్న వేళ రష్యా అత్యున్నత నాయకత్వంతో భేటీకావడం సంతోషంగా ఉందని, మాస్కోతో సన్నిహిత సంబంధాల కోసం పర్యటిస్తున్నానని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారి రజా తలారయినిక్ హర్మ్యాజ్ జలసంధిని తెరుస్తా'అమెరికా ఇకపై స్వతంత్ర దేశాలను నిర్దేశించే పరిస్థితిలో లేదు' అని ప్రకటించారు.అమెరికా యుద్ధనౌక యుఎస్‌ఎస్ రాఫెల్ పెరాల్టా ఆదివారం ఇరాన్ జెండా ఎగురవేస్తున్న చమురు ట్యాంకర్ ఎం/టి స్ట్రీమ్‌ను అడ్డుకుంది. ఇరాన్ రేవుకు చేరుకోకుండా ఈ నౌకను నిలిపివేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సిఇఎన్ టిసిఒఎం) ప్రకటించింది. హర్మ్యాజ్ మూసివేత కారణంగా విమాన ఇంధనం ధరలు పెరగడంతో రైనర్, ట్రాన్సావియా, వొలోటియా వంటి విమాన సంస్థలు సేవలను రద్దు చేశాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జాన్ నోయెల్ బారో మాట్లాడుతూ.. 'ఇరాన్ తన వైఖరిని సమూలంగా మార్చుకోకుండా.. ఈ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం సాధ్యం కాదు' అని స్పష్టం చేశారు.

# ప్రపంచ పటంలో ఫ్యూచర్ సిటీ

మొదటి పేజీ తరువాయి

భూమి పూజ చేశారు. అదేవిధంగా గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనానికి శంకుస్థాపన, మల్కాజిగిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ పరిపాలనా బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయ భవనాలను సీఎం ప్రారంభించారు.ఈ సందర్భంగారేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడి రైతుల్లో అభ ద్రతా భావం లేకుండా అధికారులు భూ సేకరణ చేపట్టాలని, అభివృద్ధి కోసం భూములిచ్చే రైతులను అధికారులు గౌరవించాలని సూచించారు. తమ గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో కలపాలని కొంతమంది తన వద్దకు వచ్చి విజ్ఞప్తిచేశారని, గ్రామసభ లు నిర్వహించి తీర్మానం చేయించి ఆ గ్రా మాలను వారి కోరిక మేరకు కమిషనరేట్ పరిధిలోకి తీసుకువచ్చేలా చూడాలని స్థానిక నాయకులను ఆదేశించారు. ఇక్కడ భూమిలిచ్చిన రైతులు, మరోచోట భూమి కొనుగో లు చేసేలా డబ్బులు ఇస్తామని తెలిపారు.య పరిష్కారానికి అందుబాటులో మంత్రి శ్రీధర్‌బాబుఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుం టుందని, మీ సమస్య పరిష్కారానికి మంత్రి శ్రీధర్‌బాబు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, పేదల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అధికారులకు సూ చిస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మీరు సహకరిస్తే దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అద్భుత నగర నిర్మాణానికి వేగం గా అడుగులు పడతాయని వెల్లడించారు.ప్రపంచంలో ఏ దేశానికి చెందిన వారైనా ఇక్కడికి వచ్చి పెట్టుబడులు పెట్టేలా ఫ్యూచర్ సిటీని అద్భుత నగరంగా అభివృద్ధి చేసుకుందామని, సింగపూర్, టోక్యో, న్యూయార్క్ లా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. జూన్ 2 లోగా ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించుకుందామన్నారు.ఇక నుంచి ఇక్కడి నుంచే సమీక్షలు నిర్వహించి పెట్టుబడులను ఆహ్వానిద్దామని తెలిపారు. నాడు ఔటర్ రింగురోడ్డు నిర్మించేటప్పుడు ఇది అయ్యేది కాదని చాలా మంది అనుకున్నారని, కానీ, 160.500 కిలోమీటర్ల ఔటర్ రింగురోడ్డు దేశంలో ఏ నగరానికీ లేదని చెప్పారుప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలి..ఫ్యూచర్ సిటీ నిర్మానంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకొని, వారికి ప్రభుత్వ అధికారిక కార్యక్రమం పాస్ పంపించాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంత సుల భం కాదని, అందరూ కలిసి పనిచేస్తేనే సాధ్యమవుతుందన్నారు.

# ఉగ్రవాదానికి మద్దతిస్తే ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి


హెచ్చరిం చారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం, వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రా ణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూ డా వాటిల్లిందన్నారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారుఉద్రిక్తతల పరిష్కారానికి దౌ త్య మార్గాలను అనుసరించాలన్నారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కజకిస్తాన్, కిర్గిస్తాన్ రక్షణ మంత్రులతో ముఖ్యమైన ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఆయన కజకిస్తాన్ రక్షణ మంత్రి, లెఫ్టినెంట్ జనరల్ డారెన్ కోసనోవ్తో సమావేశమయ్యారు. పరస్పర గౌరవానికి చిహ్నంగా ఇద్దరు నాయకులు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. భారత్ స్తాన్‌ల మధ్య పరస్పర సహకారం ఇకపై ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా విభిన్న రంగాలకు విస్తరిస్తామని ఇరుదేశాలు ప్రకటించాయి.

## అంబరాన్నంటిన జంట సిరిమానోత్సవాలు



బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో సిరిమానోత్సవాలు అంబరాన్నంటాయి. గొల్లపల్లి దాడితల్లి, పాతబొబ్బిలి సరే పోలమ్మతల్లి గ్రామదేవతల పండగల సందర్భంగా మంగళవారం సిరిమానోత్సవాలు వైభవంగా నిర్వహించారు. దాడితల్లి సిరిమానోత్సవాన్ని గొల్లపల్లి అంగడి గుడి వద్ద ప్రారంభించారు. కీడురాయికి చేరుకుని పూజలు చేసిన అనంతపురం గొల్లపల్లి వీధుల మీదుగా ఓంకార్ టాకీస్, మేదరబంద, కోట జంక్షన్, పోలీస్ స్టేషన్, రైల్వే స్టేషన్, గాంధీ బొమ్మ జంక్షన్, శ్వేత చలపతి పాఠశాల, రావువారివీధి, గొల్లవీధి మీదుగా గొల్లపల్లికి సిరిమాను చేరుకుంది. సరేపోలమ్మతల్లి సిరిమానోత్సవాన్ని పాతబొబ్బిలిలో ప్రారంభించారు. అక్కడి వీధులలో తిరిగిన తర్వాత టిబిఆర్ రోడ్డు, ఆకులరెల్లివీధి, వేపచెట్టు జంక్షన్, మేదరబంద, కోట జంక్షన్, పోలీస్ స్టేషన్, టిఆర్ కాలనీ జంక్షన్, రైల్వే జంక్షన్, గాంధీ బొమ్మ, శ్వేత చలపతి పాఠశాల, ఎన్‌టిఆర్ విగ్రహం, కంచరవీధి, దిబ్బవీధి, యుద్ధ స్తంభం మీదుగా పాతబొబ్బిలి చేరుకుంది. దాడితల్లి సిరిమానును పూజారి బత్తిన సూర్యారావు, సరే పోలమ్మతల్లి సిరిమానును పూజారి బొబ్బిలి అఖిల్ అధిరోహించారు.పోటెత్తిన జనం సిరిమానోత్సవాలను తిలకించేందుకు జనం పోటెత్తారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.పటిష్ట పోలీస్ బందోబస్తు జంట సిరిమానోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసుశాఖ 300 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించింది. డిఎస్‌పి రాకోటి గోవిందరావు, పట్టణ, రూరల్ సిఐలు కె.నారాయణరావు, ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బొబ్బిలి, గొల్లపల్లి, పాతబొబ్బిలిలో భారీ బందోబస్తు నిర్వహించారు. సిరిమానోత్సవం వద్ద తోపులాట, గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు. సిరిమానుని దర్శించుకున్న ప్రముఖులు సరే పోలమ్మతల్లి, దాడితల్లి సిరిమానోత్సవాలను మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, ఎమ్మెల్యే బేబినాయన సందర్శించారు. సిరిమాను వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అమ్మవారిని, సిరిమానును కమిషనర్ రామలక్ష్మి, తహశీల్దార్ ఎం.శ్రీను, డిఎస్‌పి గోవిందరావు, పట్టణ, రూరల్ సిఐలు నారాయణరావు, శ్రీనివాస్, ఇతర అధికారులు దర్శంచుకుని పూజలు చేశారు.

## 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



-విజయనగరం : మే 1 తేదీ నుంచి నెల రోజులు పాటు జిల్లాలో 60 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం డిఎస్‌డిఒ కార్యాలయంలో సెట్విజ్ సూపరింటెండెంట్ అక్కారావుతో కలిపి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వేసవి శిక్షణా శిబిరాలు షెడ్యూల్ ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడా శిక్షణా తరగతి జిల్లాలోని 60 కేంద్రాల్లో 21 క్రీడంశాల్లో నిష్ణాతులు, సీనియర్ క్రీడాకారులు, జాతీయ స్థాయి క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులచే ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అర్చరీ-2, అథ్లెటిక్స్-7, బాడ్మింటన్-6, బాస్కెట్ బాల్-1, బాక్సింగ్-6, చెస్-1, హ్యాండ్ బాల్-1, హాకీ-1, కబడ్డీ-4, కరాటే-4, ఖో-ఖో-2; టైక్వాండో -4,టేబులు టెన్నిస్ 1, టెన్నిస్-1; వెయిట్ లిఫ్టింగ్-2, క్రీడంశాల్లో శిక్షణా తరగతులను క్రీడా శిక్షణా తరగతుల నిర్వహణకు ప్రభుత్వం క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా ఒకొక్క శిక్షణా కేంద్రానికి అవసరమయ్యే క్రీడా పరికారాలు అలాగే తరగతులకు హాజరైన విద్యార్థులకు న్యూట్రిషన్ డైట్ నిమిత్తం రూ.4,680, శిక్షకులకు రూ.2 వేలు గౌరవవేతనం అందజేస్తుందని వివరించారు.

ప్రజాస్వామ్యం



### టి. సి.ఎస్. కు ఎంపికైన
## 8 మంది సీతం విద్యార్థులు




విజయనగరం: (ప్రజాస్వామ్యం) స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్వహించిన నేషనల్ క్వాలిఫయర్ టెస్ట్ ద్వారా ఎంపికయ్యారు. వివిధ విభాగాలకు చెందిన చివరి సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియలో రాత పరీక్ష, సాంకేతిక పరిజ్ఞానం మరియు హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించగా, 8 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో 6 మంది విద్యార్థులు టిసిఎస్ నింజా కేటగిరీలో రూ. 3.5 లక్షల వార్షిక వేతనం తో, మరో ఇద్దరు విద్యార్థులు టిసిఎస్ డిజిటల్ కేటగిరీలో రూ. 7.2 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారుఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. టిసిఎస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో 8 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని పేర్కొంటూ, రాబోయే దశల్లో ఇంకా కొంతమంది విద్యార్థులు టి.సి.ఎస్ లో ఎంపిక అవుతారని తాము ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థలతో కళాశాలను అనుసంధానం గావించి విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ, విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే తమ ముఖ్య లక్ష్యమని అన్నారు. విద్యార్థులు ఇలాంటి నేషనల్ స్థాయి ఎంపిక పరీక్షలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను నిరూపించి ఉన్నతమైన కెరీర్‌ను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, వివిధ విభాగాధిపతులు మరియు అధ్యాపక బృందం పాల్గొని ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.


### జర్నలిస్ట్ హత్యను ఖండించిన
## భీమిలి ప్రింట్ మీడియా అసోసియేషన్



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం చిత్తూరు జిల్లా, వి. కోట మండలం ఏబిఎన్ ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి హత్యను భీమిలి ప్రింట్ మీడియా అసోసియేషన్ (బిపిఎంఏ) తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నిరంతరం ఎక్కడో ఒక చోట జర్నలిస్ట్ లపై దాడులు జరుగుతూనే ఉన్నాయాన్నారు. ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యకు పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. హత్యకు గురైన జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నిజాలను వెలికితీసే విలేఖరులకు భద్రత కరువైందని ఆన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే జర్నలిస్ట్ ల కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

### పోస్టల్ ఇన్స్పెక్టర్
## ఉపేంద్ర కు ఉత్తమ ప్రతిభ అవార్డు





भारत सरकार | Government of India
डाक विभाग | Department of Posts
आंध्र प्रदेश सर्किल | Andhra Pradesh Circle

उत्कृष्टता प्रमाण पत्र

श्री. बी. उपेंद्र, उपमंडलीय प्रमुख, गजपतिनगरम उपमंडल, विजयनगरम मंडल, विशाखापत्तनम क्षेत्र को 01.03.26 से 31.03.26 तक आयोजित पी.ओ.एस.बी. चैलेंज - एस.बी. चैंपियन प्रतियोगिता में उनके शानदार प्रदर्शन और समर्पित एवं विशिष्ट सेवा की सराहना में, मुख्य पोस्टमास्टर जनरल, आंध्र प्रदेश परिमंडल द्वारा यह प्रमाण-पत्र प्रदान किया जाता है।

Certificate of Excellence

Sri. B. Upendra, Sub Divisional Head, Gajapathinagaram Sub Division, Vizianagaram Division, Visakhapatnam Region is hereby awarded this Certificate of Excellence by the Chief Postmaster General, Andhra Pradesh Circle, in recognition of exemplary performance and in appreciation of dedicated and distinguished professional service in POSB Challenge- SB Champion Contest conducted from 01.03.26-31.03.26.

28.04.2026
Bapatla

बी. पी. श्रीदेवी / B. P. Sridevi
मुख्य पोस्टमास्टर जनरल/ Chief Postmaster General
आंध्र प्रदेश परिमंडल/ Andhra Pradesh Circle
विजयवाड़ा - ५२००१३/ Vijayawada- 520013

ప్రజాస్వామ్యం / గజపతినగరం: ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో బాపట్ల లో మంగళవారం జరిగిన ఎక్సెలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో గజపతినగరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ బి.ఉపేంద్ర కు ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. పొదుపు విభాగంలో ఆయన చేసిన విశేష కృషికి గాను ఉత్తమ ప్రతిభ అవార్డు లభించింది . ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బి.పి.శ్రీదేవి చేతుల మీదుగా ఉపేంద్ర ఈ ఎక్సెలెన్స్ అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ " మార్చి నెల లో జరిగిన పొదుపు మేళ లో ఉత్తమ ప్రదర్శన కు గాను ఉత్తమ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు . దీనికి కృషి చేసిన తమ పోస్ట్ ఆఫీస్ సిబ్బందికి ఈ అవార్డ్ ను అంకితం చేస్తున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు. తమ సబ్ డివిజన్ కి అవార్డ్ రావడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ, పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కు అభినందనలు తెలిపారు.

## శ్రీ సరిపోలమ్మ అమ్మవారిసిరిమాను సంబరాల్లో సిరమ్మ



(ప్రజాస్వామ్యం) 28 ఏప్రిల్ 2026: బొబ్బిలి నియోజక వర్గం, బొబ్బిలి మండలం, బొబ్బిలిలో కొలువైవున్న శ్రీ శ్రీ శ్రీ సరే పోలమ్మ అమ్మవారి సిరిమాను మహోత్సవం శ్రీ చోడిగంజి రమేష్ నాయుడు, ఆణువంశిక ధర్మ కర్త ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి . చోడిగంజి రమేష్ నాయుడు ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మలి శ్రీ శ్రీ శ్రీ సరే పోలమ్మ అమ్మ వారి సిరిమాను సంబరాలులో పాల్గొన్నారుఈ సంబరాల్లో పాల్గొన్న సిరమ్మకు చోడిగంజి రమేష్ నాయుడు, సరే పోలమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు మరియు స్థానిక ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ సరే పాలమాంబ అమ్మ వారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు అనంతరం పండితుల ఆశీర్వాదం పొందారుఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్య కర్తలు, భక్తులు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు ఉపాధ్యక్షుడు తోటవాసు, చిన్న శ్రీను సోల్జర్స్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ దాడి తల్లి అమ్మవారు పండుగ మహోత్సవం లో సిరమ్మ

(ప్రజాస్వామ్యం) బొబ్బిలి నియోజకవర్గం, బొబ్బిలి మండలం, గొల్లపల్లి గ్రామం లో కొలువైవున్న శ్రీ శ్రీ శ్రీ దాడి తల్లి అమ్మవారి పండుగ రథోత్సవం శ్రీ సావు వెంకట మురళీ కృష్ణారావు( మాజీ మున్సిపల్ చైర్మన్) బొబ్బిలి మున్సిపాలిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి . శ్రీ సావు వెంకట మురళీకృష్ణారావు ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మలి శ్రీ శ్రీ శ్రీ దాడితల్లి అమ్మవారి రథోత్సవం సంబరాలులో పాల్గొన్నారు. ఈ సంబరాల్లో పాల్గొన్న సిరమ్మకు సావు వెంకట మురళి కృష్ణారావు గారు, దాడితల్లి అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు మరియు స్థానిక ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీదాడితల్లి అమ్మ వారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల





ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో సావు వెంకట మురళీకృష్ణ రావు మాజీ మున్సిపల్ చైర్మన్, (బొబ్బిలిన్సిపాలిటీ) స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్య కర్తలు, భక్తులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీనుసోల్జర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

**తన ఆటోలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావును ఆసుపత్రికి తీసుకువెళ్లి -మానవత్వాన్ని చాటుకున్న ఆటోడ్రైవర్ బలరాం.- ఎస్.ఐ - కే.కిరణ్ కుమార్ నాయుడు**

ప్రజాస్వామ్యం/గజపతినగరం: మండలంలోని మధుపాడ గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగినట్లు గజపతినగరం ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు . ఆయన అందించిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా గంట్యాడ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శ్రీనివాసరావు విధులలో భాగంగా బొబ్బిలి దాడితల్లి అమ్మవారి బందోబస్తు నిమిత్తం వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందని కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. శ్రీనివాసరావు తన యొక్క మోటార్ సైకిల్ పై గజపతినగరం మండలం మధుపాడ గ్రామం పాలధార చెరువు దగ్గరకు వచ్చేసరికి బొబ్బిలి వైపు నుంచి గజపతినగరం వైపు వెళ్తున్న ఒక కారు హెచ్.సి శ్రీనివాసరావు వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. కారు డ్రైవర్ మితిమీరిన వేగంతో , అజాగ్రత్తగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు. ప్రమాదంలో గాయాలు తగిలిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావును మెంటాడ మండలం రాబంద గ్రామానికి చెందిన బలరాం అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో చికిత్స నిమిత్తం





గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావును ఆటో డ్రైవర్ బలరాం అంబులెన్స్ తో వెళ్లి విజయనగరంలో గల తిరుమల హాస్పిటల్ లో చేర్పించారు. ఈ ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్. ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.

## జిల్లాలో ఇంధన సరఫరా పరిస్థితిపై కలెక్టర్ ఎస్ .రామ సుందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు



ప్రజాస్వామ్యం /విజయనగరం: జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పరిస్థితిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం పలు పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారుమొదటగా గుర్ల మండల కేంద్రంలోని జయసింహ సాయి ఏజెన్సీస్ బిపిసిఎల్ ఔట్లెట్‌ను తనిఖీ చేసి, బంకులో ఉన్న ఇంధన నిల్వలు, సరఫరా పరిస్థితులను పరిశీలించారు. బంకుకు వచ్చిన వినియోగదారులతో మాట్లాడి జిల్లాలో ఎటువంటి పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసి, అనవసర భయాందోళనలకు గురి కావద్దని సూచించారఅనంతరం గుర్ల మండలం పెనుబర్తి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌ను తనిఖీ చేసి, నిల్వలను సమృద్ధిగా ఉంచుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని బంక్ యాజమాన్యానికి సూచించారుఇక చీపురుపల్లి లోని ప్రాఖీా ఫిల్లింగ్ స్టేషన్‌ను కూడా ఆకస్మికంగా తనిఖీ చేసి, ఇంధన నిల్వలు, సరఫరా పరిస్థితులను పరిశీలించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి ఆదేశించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు నిరంతరాయంగా ఇంధనం అందుబాటులో ఉండేలా అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.



### సదా యూత్ ఆధ్వర్యంలో ఘనంగా
## గరే సదానంద జన్మదిన వేడుకలు

**ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు**



తగరపువలస, ప్రజాస్వామ్యం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గరే సదానంద జన్మదిన వేడుకలను 'సదా యూత్' ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సదానంద అందుబాటులో లేనప్పటికీ ఆయన అనుచరులు వేడుకలను ఘనంగా జరిపారు. తగరపువలస జంక్షన్‌లో బాటసారులకు మజ్జిగ పంపిణీ, సుమారు 63 మంది పేద మరియు పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేసారు. బాలాజీ నగర్‌లో ఒక పేద విద్యార్థి విద్యకు భరోసా ఇస్తూ దత్తత తీసుకున్నారు. 5వ వార్డు, బాలాజీ నగర్, శ్రీనగర్, బంగ్లామెట్ట, గాంధీ బొమ్మ, కొండపేట ప్రాంతాల్లో కేక్ కటింగ్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మిన సూరిబాబు, చోడి వినోద్ కుమార్, కె.రవికుమార్, సాయి, బన్ను, నవీన్, తమ్మిన నాని, జగదీష్, సునీల్, నాని బాబు సదా సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ సేవే లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమాల్లో సదా యూత్ సభ్యులు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

### కళాసాహితి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా
## తరగతి విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ

భీమునిపట్నం, ప్రజాస్వామ్యం బీమిలి కళాసాహితి నిర్వహణలో జరుగుతున్న విద్యార్థుల శిక్షణా శిబిరంలో మంగళవారం విద్యార్థులకు పిన్నింటి ఎర్రయ్య రెడ్డి పుస్తకలు, పెన్నులు అందించారు. ఈ శిక్షణా కార్యక్రమం లో విద్యార్థులు నేర్చుకున్న విషయాలను పుస్తకాల్లో రాసుకోవాలని కోరారు. మంగళవారం జరిగిన కార్యక్రమం లో లెక్కలు పాఠాలను కంటుబుక్త రామానాయుడు, పక్కి నాగేశ్వర్ రావు చెప్పగా, తెలుగు పద్యాలు గురించి కొండా శంకర రావు, చిత్రకళ గురించి వారణాసి గౌరీ శంకర రావు, లఘు నాటికలు గురించి పి ఆర్. పి వర్మ తరగతులు చెప్పారు. కళాశాహితి కార్యదర్శి ఆదినారాయణ స్వాగతంపలికిన ఈ కార్యక్రమం లో అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ వర్మ, సభ్యులు ఎం. లక్ష్మణ రావు, ఏచ్చెర్ల హరి, ఎన్.ఆనందరావ్, పి. బాల, సన్యాసి నాయుడు, పోలిపల్లి నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి సాప్ బాక్సింగ్ పోటీలకు
## ఎంపికైన విద్యార్థులకు అభినందనలు



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) బాక్సింగ్ లీగ్ టోర్నమెంట్ జిల్లా స్థాయి లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాస్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని తెలియజేశారు. అదేవిధంగా శిక్షణనిచ్చిన బాక్సింగ్ కోచ్ శ్రీ వర్షితను ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 24 న విశాఖపట్నం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ స్కూల్ విద్యార్థులు వి.అభినవ్, 8 వ తరగతి, బి.లక్ష్మీ చంద్రహాస్, 7 వ తరగతి అండర్ – 15 వర్గంలో ఎంపికయ్యారు. వీరు మే 11,12,13 తేదీలలో రాజీవ్ గాంధీ స్టేడియం, గాజువాక లో జరుగబోవు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొనుచున్నారు.

## సిహెచ్‌సిలో
## వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సి హెచ్ సి) లో మంగళ వారం వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు జరిగాయి. వార్డు, గ్రామ సచివాలయా ల్లో స్లాట్ బుకింగ్ చేసుకున్న అనంతరం సంబంధిత పత్రాలతో హాజరైన 30 మందికి కె. కోటపాడు ప్రభుత్వాసుపత్రి ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డా. మహేశ్వర రావు ఈ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డా. ఎం.ఫణి కుమార్ పర్యవేక్షణ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ దివ్య పాల్గొన్నారు.



## బేసిక్ హిందీ కూడా రాదు..

### సీతమ్మగా నటిస్తావా? సాయి పల్లవిపై ట్రోలింగ్!

సినిమా ప్రమోషన్లలో మాట్లాడే భాషకు.. సినిమాలో చేసే నటనకు సంబంధం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.సహజ నటిగా గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవి తాజాగా సోషల్ మీడియాలో నెటిజన్ల విమర్శలకు గురవుతున్నారు. ఈ మలయాల బ్యూటీ నటించిన హిందీ చిత్రం -ఏక్ దిన్- మే 1న విడుదల కానున్న నేపథ్యంలో ముంబైలో -ఏక్ దిన్ కీ మెహఫిల్- పేరుతో ఒక సంగీత వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథులను, మీడియాను ఉద్దేశించి సాయి పల్లవి హిందీలో మాట్లాడేందుకు ప్రయత్నించారు. అయితే తనకు హిందీ అంతగా రాదని నిజాయితీగా ఒప్పుకోవడమే ఇప్పుడు వివాదానికి కారణమైంది. అంతేకాదు.. సాయిపల్లవి తడబడుతూ హిందీ మాట్లాడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో హిందీ బెల్ట్ నెటిజన్లు విమర్శల వర్షం కురిపిస్తున్నారు.ముఖ్యంగా నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం -రామాయణ-లో సాయి పల్లవి సీతాదేవి పాత్ర పోషిస్తుండటంపై నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కనీసం బేసిక్ హిందీ పదాలు కూడా రాని సాయి పల్లవిని సీతా మాత పాత్రకు ఎలా ఎంపిక చేస్తారు? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. హిందీ సరిగ్గా మాట్లాడలేని నటిని తీసుకోవడం ద్వారా నితీష్ తివారీ తప్పుడు నిర్ణయం తీసుకున్నారని.. ఇది చాలా దారుణమైన కాస్టింగ్ అని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సినిమాలో సాయిపల్లవి సొంతంగా డబ్బింగ్ చెబుతుందా లేక వేరొకరితో చెప్పిస్తారా అనే అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు.అయితే సాయి పల్లవిపై వస్తున్న ఈ ట్రోలింగ్ను తన అభిమానులు, డైహార్డ్ ఫాలోవర్స్ మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నారు. గతంలో కత్రినా కైఫ్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ వంటి హీరోయిన్లు కూడా హిందీ రాకపోయినా బాలీవుడ్లో రాణించలేదా? అని వారు గుర్తు చేస్తున్నారు. అంతేకాదు ఒకట్రెండు ఎక్స్ ప్రెషన్లతోనే భాష తెలియకుండానే కత్రిన కైఫ్ తెలుగు నాట -మల్లీశ్వరి-గా పరిచయం కాలేదా? అంటూ రివర్స్ కౌంటర్లు వేస్తున్నారు. నటన అనేది భాషకు అతీతమని.. నటీనటులు డైలాగ్స్ను కంఠస్థం చేసి భావోద్వేగాలను పండించడంలో దిట్టలని మద్దతు తెలుపుతున్నారు. గాయకులు అర్థం తెలియకపోయినా ఎన్నో భాషల్లో పాటలు పాడినట్లే.. నటులు కూడా ఏ భాషలోనైనా అద్భుతంగా నటించగలరని వారు కౌంటర్ ఇస్తున్నారుసినిమా ప్రమోషన్లలో మాట్లాడే భాషకు.. సినిమాలో చేసే నటనకు సంబంధం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలో సాయి పల్లవి హిందీ డైలాగులు సరిగ్గా చెబితే చాలని..ఆమె ప్రతిభ గురించి తెలియకుండా ఇలాంటి ఆకతాయి ప్రశ్నలు వేయడం సరికాదని హితవు పలుకుతున్నారు. అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న -ఏక్ దిన్- సినిమాలో జునైద్ ఖాన్తో కలిసి ఆమె నటించారు. 2016 నాటి థాయ్ చిత్రం -వన్ డే-కు రీమేక్గా వస్తున్న ఈ రొమాంటిక్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి.సాయి పల్లవి నటిగా దక్షిణాదిన ఇప్పటికే తనదైన ముద్ర వేసారు. ఇప్పుడు బాలీవుడ్లో కూడా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఇలాంటి భాషా భేధాలు తలెత్తడం అభిమానులను కలవరపెడుతోంది. భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణకు ఒక సాధనం మాత్రమేనని.. ఒక నటి ప్రతిభను కేవలం భాషా పరిజ్ఞానంతో కొలవలేమని మెజారిటీ ప్రేక్షకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా మే 1న విడుదలయ్యే -ఏక్ దిన్-.. దీపావళి బరిలో రానున్న -రామాయణ- చిత్రాలతో సాయి పల్లవి అన్ని విమర్శలకు చెక్ పెడుతుందనే ఆశిద్దాం.

### బ్లాక్ శారీలో సన్నని నడుము..

## అందాల జ్యోతి స్టన్నింగ్ లుక్



గ్లామర్ వరల్డ్ లో ఎంతోమంది అప్సరసల నడుమ పోటీని తట్టుకోవడం అంత చిన్న విషయం కాదు. ఇక వారిలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జ్యోతి పూర్వాజ్, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు హాట్ టాపిక్గా మారాయి. బ్లాక్ ట్రాన్స్పరెంట్ శారీలో ఆమె కనిపిస్తున్న తీరు చూస్తుంటే, ట్రెడిషనల్ వేర్లో కూడా గ్లామర్ను ఎలా ఎలివేట్ చేయాలో ఆమెకు బాగా తెలుసనిపిస్తోంది. అతిగా చేయకుండా, కేవలం తన చూపులతోనే కుర్రకారును ఆకట్టుకుంటోందిఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోందిఈ ఫోటోల్లో జ్యోతి తన నేచురల్ బ్యూటీని చాలా చక్కగా ప్రజెంట్ చేసింది. విరబోసిన జుట్టు, సింపుల్ మేకప్, మెడపై ఉన్న చిన్న టాటూ ఆమె లుక్కు ఒక మోడ్రన్ టచ్ ఇచ్చాయి. ముఖ్యంగా కెమెరా వైపు చూస్తూ ఆమె ఇస్తున్న స్మైల్ ఫోటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. నేటి జనరేషన్ ఫ్యాషన్ ట్రెండ్స్ను ఫాలో అవుతూనే, శారీ కట్టులో ఉండే ఆ హుందాతనాన్ని ఎక్కడా తగ్గకుండా చూసుకుందిడీసెంట్ అప్పీల్తోనే గ్లామర్ డోస్ పెంచవచ్చని ఈ క్లిక్స్తో నిరూపించింది. జ్యోతి పూర్వాజ్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె ప్రయాణం చాలా బలన్స్ గా సాగుతోంది. బుల్లితెరపై నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఆ తర్వాత వెండితెరపై కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనతో ఆడియన్స్ను అలరిస్తోంది. కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా, పెర్ఫార్మెన్స్కు స్కోప్ ఉన్న పాత్రలు చేయడానికే ఆమె ప్రాధాన్యత ఇస్తోంది.ఇండస్ట్రీలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, తనకంటూ ఒక ఇమేజ్ను క్రియేట్ చేసుకోవడంలో ఆమె సక్సెస్ అయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో జ్యోతికి మిలియన్ల కొద్దీ ఫాలోయింగ్ ఉంది. ఆమె షేర్ చేసే ప్రతి ఫోటో కూడా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. నటిగానే కాకుండా ఒక ఫ్యాషన్ ఐకాన్గా కూడా ఆమె ఎదుగుతోంది. ఫిట్నెస్ విషయంలో ఆమె తీసుకుంటున్న జాగ్రత్తలు ఈ లేటెస్ట్ ఫోటోషూట్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన లుక్స్తో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపిస్తూ ఫ్యాన్స్ను థ్రిల్ చేస్తోంది. ముఖ్యంగా యువతలో ఆమెకు ఉన్న క్రేజ్ ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. మరి అమ్మడు ఈ గ్లామర్ తో ఎలాంటి ఆఫర్లు అందుకుంటుందో చూడాలి.

### హీరోల డూప్స్, ఫేస్ స్వాప్..

## జేడీ చక్రవర్తి ఉద్దేశం ఏంటి?




టాలీవుడ్ లో టెక్నాలజీ వినియోగం, హీరోల పనితీరుపై నటుడు, దర్శకుడు జేడీ చక్రవర్తి లేటెస్ట్ గా చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సినిమా షూటింగ్స్ లో డూపులు, ఫేస్ స్వాప్ లు, వీఎఫ్ఎక్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో జరుగుతున్న వాస్తవాలు స్పష్టంగా చెప్పినట్లుగా కొంతమంది నెటిజన్లు అభిప్రాయపడుతున్నారుఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన జేడీ చక్రవర్తి, కొంతమంది హీరోలు షూటింగ్ కు పూర్తి స్థాయిలో హాజరుకాకపోయినా, క్లోజ్ అప్ షాట్లు, డూపులు, ఫేస్ స్వాప్ టెక్నాలజీ సహాయంతో సినిమాలను పూర్తి చేస్తున్నారని అన్నారు. ఆ విషయాలు దర్శకులకు, నిర్మాతలకు, మొత్తం ఇండస్ట్రీకి తెలియవా అనే ప్రశ్నను కూడా ఆయన లేవనెత్తారు.అయితే ఇలాంటి పరిస్థితుల్లో కూడా వాళ్లతో ఎందుకు సినిమాలు చేస్తున్నారు అంటే, ఒకటే కారణం.. అది సదరు హీరోకు ఉన్న మార్కెట్ అని స్పష్టం చేశారు. 'ఒక హీరోకి మార్కెట్ ఉంటే నిర్మాతలు డబ్బు పెట్టడానికి వెనుకాడరు. వాళ్లకు లాభం వస్తుందనే నమ్మకం ఉంటుంది. కాబట్టి షూటింగ్ ఎలా జరిగింది? ఎవరు ఎంత పనిచేశారు? అనే విషయాల కంటే చివరికి సినిమా ఎంత కలెక్షన్లు తెచ్చింది అనేది ముఖ్యం' అని జేడీ చక్రవర్తి తెలిపారు.ప్రేక్షకుల దృష్టిలో కూడా ఆ విషయాలు పెద్దగా ప్రభావం చూపవని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఆడియన్స్ చాలా సింపుల్. వారికి సినిమా కంటెంట్ నచ్చితే చూస్తారు, లేదంటే వదిలేస్తారు. ఎవరు డూప్ వేశారు, ఎక్కడ ఫేస్ స్వాప్ చేశారు, గెడ్డం దగ్గర వీఎఫ్ఎక్స్ వాడారు అనే విషయాలు వాళ్లు పెద్దగా పట్టించుకోరు' అని చెప్పారు. ఇప్పటికే కొన్ని సినిమాల ప్రమోషన్స్ లో నిర్మాతలు, దర్శకులు పలు విషయాలు చెబుతుంటారని అన్నారుసినిమాకి ఆరు నెలలు వీఎఫ్ఎక్స్ పని చేశామని, ఇంత ఖర్చు పెట్టామని చెప్పడం సాధారణంగా మారిందని ఆయన గుర్తుచేశారు. అంటే టెక్నాలజీ వినియోగం గురించి వాళ్లే ఓపెన్ గా చెబుతున్నారని, అందులో దాచి పెట్టే అంశం ఏమీ లేదని తెలిపారు. ప్రస్తుతం జేడీ చక్రవర్తి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొంతమంది ఆయన కామెంట్స్ కు మద్దతు ఇస్తున్నారు.ఇండస్ట్రీలో జరుగుతున్న వాస్తవాలు ధైర్యంగా చెప్పారని మరికొందరు అంటుంటే, ఇంకొందరు మాత్రం హీరోలపై ఆ విధంగా కామెంట్స్ చేయడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా జేడీ చక్రవర్తి కామెంట్స్ సినిమా ప్రొడక్షన్ లో మార్పులు, టెక్నాలజీపై ఆధారపడుతున్న విధానాలు, అలాగే ప్రేక్షకుల టేస్ట్.. మరోసారి చర్చకు దారితీశాయి. ఏదేమైనా కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటే ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తారనే విషయాన్ని జేడీ చక్రవర్తి మరోసారి స్పష్టం చేసినట్లు అర్థమవుతోంది.

### పోలీస్గా సంయుక్త మీనన్...

## ది బ్లాక్ గోల్డ్ లో మాస్ అవతార్!

టాలీవుడ్లో లేడీ ఓరియెంటెడ్ సినిమాల దిశగా మరో ఆసక్తికరమైన అడుగు పడింది. సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న హై ఓక్టేన్ యాక్షన్ డ్రామా ది బ్లాక్ గోల్డ్ ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు యోగేష్ కేఎంసీ దర్శకత్వం వహిస్తున్నారు. నిజ జీవితంలో చోటుచేసుకున్న షాకింగ్ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకోవడం విశేషం. కేవలం 60 రోజుల్లోనే మొత్తం షూటింగ్ పూర్తి చేయడం టీమ్ ప్లాన్ కు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.ఇటీవల చిత్రబృందం రిలీజ్ చేసిన సంయుక్త లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. పోలీస్ ఆఫీసర్ పాత్రలో ఆమె కనిపించిన తీరు నిజ జీవిత పోలీస్ అధికారిని గుర్తు చేసేలా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె లుక్లో ఉన్న సీరియస్నెస్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ ప్రెజెన్స్ ఇన్నవీ కలిపి ఒక పవర్ఫుల్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తున్నాయి. మేకింగ్ వీడియోలో కూడా ఈ పాత్ర కోసం తీసుకున్న కష్టాన్ని స్పష్టంగా చూపించారు. ప్రతి సీన్లో రియాలిటీకి దగ్గరగా ఉండేలా డైరెక్టర్ స్పెషల్ కేర్ తీసుకున్నట్టు తెలుస్తోందిఈ సినిమా కథ తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న బొగ్గు సిండికేట్ అక్రమ కార్యకలాపాల చుట్టూ తిరుగుతుంది. బెల్లంపల్లి, కాగజ్నగర్ వంటి రియల్ కోల్ మైన్ ప్రాంతాల్లో షూటింగ్ జరపడం ద్వారా కథకు సహజత్వం తీసుకొచ్చారు. అలాగే హైదరాబాద్లో ప్రత్యేకంగా రూపొందించిన సెట్స్లో కీలక సన్నివేశాలు షూట్ చేశారు. కథలో సంయుక్త పోషిస్తున్న నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్ పాత్ర చుట్టూనే మెయిన్ కథంతా నడుస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా చట్టాన్ని నిలబెట్టాలనే ఆమె పోరాటం ఈ సినిమాకు మేజర్ హైలైట్గా నిలవనుంది.టెక్నికల్గా కూడా ఈ సినిమా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కినట్టు సమాచారం. యాక్షన్ సన్నివేశాల కోసం ఒకేసారి ఐదు కెమెరాలతో షూటింగ్ చేయడం ద్వారా గ్రాండ్ విజువల్ ఎఫెక్ట్ను అందించారు. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో ఇంత భారీ స్థాయిలో యాక్షన్ ఎలిమెంట్స్ చూపించడం అరుదుగా కనిపించే విషయం. ఈ విషయంలో ది బ్లాక్ గోల్డ్ కొత్త బెంచ్మార్క్ సెట్ చేసే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా డబ్బింగ్, రీరికార్డింగ్ దశలో ఉంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేసే అవకాశముంది. కంటెంట్, స్కేల్, సంయుక్త మీనన్ పవర్ఫుల్ పాత్ర.. ఇవన్నీ కలిపి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కొత్త చర్చలకు దారితీయనుందా అన్నది ఆసక్తికరంగా మారింది.




## ట్రెండింగ్ లో సమంత 'బంగారం' ప్లాన్



సోషల్ మీడియాలో ఒక పాట వైరల్ అయితే సినిమా సగం జనాల్లోకి వెళ్ళిపోయినట్లే. ఇప్పుడు సమంత కూడా సరిగ్గా ఇదే ఫార్ములాను నమ్ముకుంది. తన కొత్త సినిమా ప్రమోషన్ల కోసం భారీ స్పీచ్లు, ఈవెంట్లు కాకుండా.. ఒకే ఒక్క పాటతో ఇన్స్టాగ్రామ్ రీల్స్ను షేక్ చేస్తోంది. 'మా ఇంటి బంగారం' అంటూ వస్తున్న ఈ సినిమా చుట్టూ ఇప్పుడిప్పుడే పాజిటివ్ బజ్ మొదలవుతోంది. అయితే కేవలం పాటలతోనే థియేటర్లకు జనం వస్తారా? లేక లోపల కంటెంట్ కూడా అదే రేంజ్లో ఉందా? అనే చర్చ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.సినిమాలోని 'తస్సాదియ్యా' సాంగ్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతోంది. సంతోష్ నారాయణన్ మార్క్ బీట్స్కు తోడు, సమంత ఎనర్జీ తోడవ్వడంతో ఇప్పటికే 20 వేలకు పైగా రీల్స్ వచ్చాయి. ఈ సినిమాను మే 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ డేట్ ఫిక్స్ చేశారు. రీసెంట్గా వచ్చిన టీజర్ చూస్తుంటే, ఒక సాదాసీదా ఇల్లాలు తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి చేసే పోరాటమే ఈ 'మా ఇంటి బంగారం' అని అర్థమవుతోంది.ఈ సినిమాకు సమంత నిర్మాత కూడా. రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'పై ఈ రిస్క్ తీసుకున్నారు. స్టార్ హోదా ఉన్నా సరే, సొంతంగా డబ్బులు పెట్టి సినిమా తీయడం అంటే అది ఒక అగ్ని పరీక్షే. అందుకే ప్రమోషన్ల విషయంలో వెన్నెల కిషోర్ లాంటి వాళ్లతో ఫన్నీ వీడియోలు చేయిస్తూ ఆడియన్స్ను ఎంగేజ్ చేసే ప్రయత్నం చేస్తోంది. ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాకు పక్కా యాక్షన్ సీన్లను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించారునందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో గుల్షన్ దేవయ్య, శ్రీముఖి, గౌతమి వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సిటాడెల్' తర్వాత సమంత నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ఆడియన్స్లో కూడా ఒక రకమైన అంచనాలు ఉన్నాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ఒక బాధ్యత గల గృహిణిగా ఆమె చేస్తున్న ఈ యాక్షన్ అటెంప్ట్ ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలిసమ్మర్ సీజన్ కాబట్టి ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంది.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022